క్లుప్తంగా

ఉద్యోగుల వేతనాల బడ్జెట్ విడుదల చేయాలి


వెంకన్నబాబు

రామచంద్రపురం రూరల్: సమగ్ర శిక్ష ప్రాజెక్టు పరిధిలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, పార్ట్‌టైం ఉద్యోగులకు ఆగస్టు నెలకు సంబంధించిన వేతనాల బడ్జెట్‌ను తక్షణమే విడుదల చేయాలని సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, పార్ట్‌టైం ఉద్యోగుల జిల్లా జేఏసీ చైర్మన్ సీహెచ్ వెంకన్నబాబు శుక్రవారం డిమాండ్ చేశారు. ఈ నెలలో 12వ తేదీ వచ్చినా ఇప్పటికీ వేతనాలు పడకపోవడంతో ఇంటి అద్దెలు, ఈఎంఐలు, కుటుంబ పోషణ విషయంలో ఉద్యోగులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చాలీచాలని జీతాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్న ఉద్యోగులకు వెంటనే వేతనాల బడ్జెట్‌ను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ఏడాది వార్షిక బడ్జెట్‌ను ఒకేసారి విడుదల చేసి ఉద్యోగులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఈ మేరకు రాష్ట్ర సమగ్ర శిక్ష అధికారులను కలసి పరిస్థితిని వివరించినట్టు తెలిపారు.

స్మార్ట్ రేషన్ కార్డులతో అవకతవకలకు చెక్


అంగరలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

కపిలేశ్వరపురం: స్మార్ట్ రేషన్ కార్డులతో అవకతవకలకు చెక్ పెట్టవచ్చని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. అంగరలో శుక్రవారం సర్పంచ్ వాసా కోటేశ్వరరావు అధ్యక్షతన స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ స్మార్ట్ కార్డులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించారన్నారు. తహసీల్దార్ జి.శ్రీనివాస్ మాట్లాడుతూ రేషన్ షాపులో వేలి ముద్ర వేయడం ద్వారా స్మార్ట్ కార్డును పొందవచ్చన్నారు. మండలంలోని 19 గ్రామాల్లో నూతనంగా మంజూరైన 434 కార్డులతో కలిపి మొత్తం 21,511 స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి విజయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు మేడిశెట్టి దుర్గారావు, పెద్దిరెడ్డి శేషారత్నం, పీఏసీఎస్ చైర్మన్ పుత్సల శ్రీనివాస్, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుడాల జయబాబు, ఎంపీడీఓ జి.రాజేంద్ర ప్రసాద్, ఎంఎస్ఓ పద్మ తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వరస్వామి సన్నిధిలో ఐటీ డైరెక్టర్ జనరల్


ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో పూజలు చేస్తున్న ఇన్‌కమ్ ట్యాక్స్ డైరెక్టర్ జనరల్ ఆనంద్ రాజేశ్వర్ బైవర్

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామిని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల ఇన్‌కమ్ ట్యాక్స్ డైరెక్టర్ జనరల్ ఆనంద్ రాజేశ్వర్ బైవర్ కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయం వద్ద వారికి పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేద పండితులు ఆశీర్వచనాలు, ఆలయ సిబ్బంది స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

డ్రోన్ ఉపయోగిస్తే ఖర్చు ఆదా


ముక్కామలలో డ్రోన్‌తో పిచికారీ విధానాన్ని వివరిస్తున్న అధికారులు

అంబాజీపేట: వ్యవసాయ సాగులో చీడ పీడల నివారణకు డ్రోన్ ఉపయోగించడం వల్ల సమయంతో పాటు ఖర్చు ఆదా అవుతుందని ఎస్ఎఫ్ఏ రాధిక, ఏఓ కె.ధర్మప్రసాద్ రైతులకు వివరించారు. ముక్కామలలో వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో చీడపీడల నివారణకు డ్రోన్ ద్వారా పిచికారీ చేసే విధానాన్ని రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ అగ్నిఅస్త్రంను డ్రోన్ ద్వారా పిచికారీ చేయడం వల్ల పొడ తెగులు, మెడ విరుపు తెగుళ్లను నివారించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ కషాయాలను రైతులు సొంతంగా తయారు చేసుకోవచ్చన్నారు. అందుకు గాను రైతులకు ఎంటీ నాగవేణి, దుర్గాలక్ష్మి వివరిస్తారన్నారు. అనంతరం తెగుళ్ల నివారణకు మారేడు పత్ర కషాయాన్ని డ్రోన్ ద్వారా పిచికారీ చేసే విధానాన్ని రైతులకు వివరించారు. కార్యక్రమంలో వీఏఏ తేజ, సీఆర్పీలు కె.మల్లేశ్వరి, ఎం.సరితాశ్రీలక్ష్మి, రైతులు పిల్లా సూరిబాబు, యడ్ల వెంకటేశ్వరరావు, సుంకర జ్యోతి, మట్టపర్తి సత్యనారాయణ పాల్గొన్నారు.

కనీస వసతులు కరవు

- పరాయి పంచన గొల్లపాలెం పోలీస్ స్టేషన్
- ఇరుకు భవనంలో ఇక్కట్లు
- మౌలిక సౌకర్యాలు లేని వైనం
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న సిబ్బంది


పీహెచ్‌సీ సబ్ సెంటర్‌లో కొనసాగుతున్న గొల్లపాలెం పోలీస్ స్టేషన్

కాజులూరు: ప్రజలకు రక్షణ కల్పించే రక్షణశాఖ కార్యాలయానికే రక్షణ కరువైంది. దశాబ్దాల చరిత్ర కలిగిన గొల్లపాలెం పోలీస్ స్టేషన్‌కు సొంత భవనం లేకపోవటంతో సిబ్బంది, ఫిర్యాదుదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. 1946లో కోరంగి పోలీస్ స్టేషన్ నుంచి 10 గ్రామాలు, రామచంద్రపురం పోలీస్ స్టేషన్ నుంచి 14 గ్రామాలను కలుపుతూ గొల్లపాలెంలో కొత్త పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. తరువాత మండలాల ఏర్పాటుతో కాజులూరు మండలంలోని 26 గ్రామాలకు గొల్లపాలెం పోలీస్ స్టేషన్ రక్షణ శాఖ కార్యాలయంగా సేవలందిస్తోంది. ప్రారంభం నుంచి 65 సంవత్సరాల పాటు ఒకే ఇంటిలో పోలీస్ స్టేషన్ అద్దెకు కొనసాగింది. 2011లో భారీ వర్షాలకు అద్దె భవనం కూలిపోవడంతో అప్పటికప్పుడు పోలీస్ స్టేషన్‌ను జర్నలిస్టు కాలనీకి ఆనుకుని ఉన్న పీహెచ్‌సీ సబ్ సెంటర్‌లోకి మార్చారు. అప్పటి నుంచి పోలీస్ స్టేషన్ అక్కడే కొనసాగుతుంది.

మురుగుపోతున్న నిధులు

గొల్లపాలెం పోలీస్ స్టేషన్‌కు సొంత భవనం నిర్మించాలని స్థానికులు, సిబ్బంది చేస్తున్న ప్రయత్నాలు కార్యరూపం దాల్చడంలేదు. సరైన స్థల సదుపాయం లేకపోవడంతో మూడుసార్లు మంజూరైన నిధులు మురుగుపోయాయి. పంచాయతీ కార్యాలయాన్ని ఆనుకుని ఉన్న ఎనిమిది సెంట్ల స్థలాన్ని పోలీస్ స్టేషన్‌కు కేటాయిస్తూ గతంలో సర్పంచులుగా పనిచేసిన పోతురాజు బాబూరావు, కొప్పుల సత్యనారాయణ రెండు సార్లు తీర్మానాలు చేయించి ఇచ్చారు. కాగా రక్షణశాఖ నిబంధనల ప్రకారం భవన నిర్మాణానికి కనీసం 10 సెంట్లు భూమి కావలసి ఉండటంతో ఆ నిధులు మురుగుపోయాయి. ప్రస్తుతం కాకినాడ, కోటిపల్లి రహదారిలో స్టేట్‌బ్యాంక్ పక్కన ఉన్న రెవెన్యూ స్థలం పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి అనుకూలంగా ఉండడంతో సదరు స్థలానికి గ్రామ పంచాయతీ తీర్మానం చేసి ఇచ్చింది. అయినప్పటికీ కొత్త భవనం నిర్మాణానికి నోచుకోవడం లేదు. పలుమార్లు స్టేషన్ విజిట్‌కు వచ్చిన ఉన్నతాధికారులు పీహెచ్‌సీ సబ్ సెంటర్‌లోని ఇరుకు గదుల్లో పోలీస్ స్టేషన్ నిర్వహణను గమనించి ఆశ్చర్యానికి గురయ్యారు. ఉన్నతాధికారులతో చర్చించి నూతన భవన నిర్మాణానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీలు ఇచ్చి వెళ్లుతున్నారే తప్ప కార్యరూపం దాల్చటం లేదు.

నేరస్తుల పరార్

పీహెచ్‌సీ సబ్‌సెంటర్ భవనం చిన్నది కావడంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిందితులను ఉంచేందుకు లాకప్ సైతం లేకపోవటంతో ఏడాది క్రితం రిమాండ్‌లో ఉంచిన ముగ్గురు బాల నేరస్తులు పరారయ్యారు. వీరు పోతూపోతూ మరో మూడు భారీ నేరాలకు పాల్పడటంతో పాటు రోడ్డు ప్రమాదానికి గురికావటంతో ఈ సంఘటన అపట్లో రాష్ట్ర స్థాయిలో తీవ్ర సంచలనం సృష్టించింది. రికార్డులు భద్రపరుచుకునేందుకు గదులు లేకుండా పోయాయి. ఉన్న రెండు గదులనే వివిధ విభాగాలుగా విభజించి సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. మరుగుదొడ్లు లేకపోవటంతో అత్యవసర సమయాల్లో సిబ్బంది ఆరుబయటకు వెళ్లవలసి వస్తోంది. స్టేషన్‌లో ఇద్దరు మహిళా కానిస్టేబుల్స్ ఉన్నారు. వారి ఇబ్బందులు వర్ణనాతీతం. భవనం పల్లపు ప్రాంతంలో ఉండటంతో కొద్దిపాటి వర్షం వచ్చినా జలమయమవుతోంది.

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం



గొల్లపాలెం పోలీస్ స్టేషన్‌కు సొంత భవనం లేకపోవడంతో పీహెచ్‌సీ సబ్ సెంటర్‌లో స్టేషన్‌ను కొనసాగిస్తున్నాం. సరైన వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఇరుకు గదుల్లోనే విధులు నిర్వహిస్తున్నాం. నాయకులు, అధికారులు స్పందించి భవన నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలి.

ఎం.మోహన్‌కుమార్, ఎస్సై, గొల్లపాలెం

కూర్చునేందుకు జాగా లేదు



గొల్లపాలెం పోలీస్ స్టేషన్‌ను ఇరుకు గదుల్లో నిర్వహిస్తున్నారు. సిబ్బంది విధులు నిర్వహించేందుకే చోటు లేదు. స్థానిక సమస్యలపై పోలీస్ స్టేషన్‌కు వెళితే ఫిర్యాదు దారులు కనీసం కుర్చునేందుకు జాగా లేకుండా పోయింది.

పెంకే సత్యనారాయణ, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్, కాజులూరు

రోడ్డు పనులు పూర్తి చేయాలంటూ ఆందోళన


కుయ్యేరు-గొల్లపాలెం రహదారిపై కాజులూరు కృష్ణుని గుడి వద్ద ఆందోళన చేస్తున్న అఖిల పక్షం నాయకులు


కాజులూరు: మండలంలో అసంపూర్తిగా నిలిచిపోయిన కుయ్యేరు-గొల్లపాలెం రహదారి పనులు వెంటనే పూర్తి చేయాలని కోరుతూ శుక్రవారం అఖిల పక్షం నాయకులు ఆందోళన చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కాజులూరు కృష్ణుని గుడి వద్ద కుయ్యేరు, గొల్లపాలెం రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శీల మాజీ ఎంపీటీసీ మాధవరపు నానాజీ మాట్లాడుతూ గొల్లపాలెం-కుయ్యేరు మధ్య రూ.36 కోట్లతో 13 కిలో మీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వ హయంలో పనులు ప్రారంభించారన్నారు. ఏళ్లు గడుస్తున్నా పనులు ముందుకు సాగడం లేదన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రహదారిపై గోతులు ఏర్పడి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు మాట్లాడుతూ రహదారితో పాటు పలు వంతెనలు శిథిలావస్థకు చేరాయన్నారు. ఈ రోడ్డు దుస్థితిపై గతంలో అఖిల పక్షం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పందించి పనులు పునః ప్రారంభిస్తామని హామీ ఇచ్చినా ఇప్పటికీ కార్యారూపం దాల్చలేదన్నారు. ఇప్పటికైనా రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ మండల సమన్వయ కమిటీ చైర్మెన్ దంగేటి అరుణ్ కుమార్, పార్టీ నాయకుడు యాళ్ల నరసింహమూర్తి, అమలాపురం బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ కడలి రాంపండు, సలాది నానాజీ తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందులు రైతులకు మాత్రమే విక్రయించాలి


ద్రాక్షారామ రైతు సేవా కేంద్రంలో డీలర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వ్యవసాయ, పోలీస్ అధికారులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ రైతు సేవా కేంద్రంలో ఎరువులు, పురుగు మందుల డీలర్లతో వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇటీవల గడ్డి మందు తాగి పలువురు ఆత్మహత్యలకు పాల్పడుతున్న నేపథ్యంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదేశాల మేరకు ఈ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ బి.నాగకుమార్ మాట్లాడుతూ కలుపు మందులు అమ్మినప్పుడు కొనుగోలుదారులు రైతులేనని పూర్తిగా నిర్ధారించుకున్న తరువాత మాత్రమే విక్రయించాలని సూచించారు. ఆందోళనతో వచ్చిన వారికి, చిన్న వయస్సు వారికి పురుగు మందులు అమ్మవద్దని హెచ్చరించారు. మందులు కొనుగోలు చేసినప్పుడు వారి కుటుంబ సభ్యులకు కూడా తెలియపరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. రామచంద్రపురం సీఐ ఎంవీ నారాయణ మాట్లాడుతూ పురుగు మందులు, కలుపు మందులు రైతులు కాని వారికి అమ్మడం, బిల్లులు లేకుండా అమ్మడం వంటి చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డీలర్లు సామాజిక బాధ్యతతో మెలగాలని కోరారు. రామచంద్రపురం మండల వ్యవసాయ అధికారి టీవీఆర్ మణిదీప్ డీలర్లు అందరితోనూ రైతుల శ్రేయస్సు కోసం పనిచేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏఓ సద్గురు మూర్తి, రామచంద్రపురం ఎస్సై నాగేశ్వరరావు, డీలర్ల అసోసియేషన్ నాయకులు మేకా సురేష్, నేమాని సత్యనారాయణ, రామచంద్రపురం, కె.గంగవరం మండలాల డీలర్లు పాల్గొన్నారు.

15, 16 తేదీల్లో స్కూల్ గేమ్స్‌కు ఎంపికలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ వీరరాఘవ రెడ్డి

రామచంద్రపురం రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15, 16 తేదీల్లో రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో స్కూల్ గేమ్స్ ఎంపికలు నిర్వహించనున్నట్టు రామచంద్రపురం ఎంఈఓలు తాడి వీరరాఘవ రెడ్డి, వాసంశెట్టి నాగేశ్వరి తెలిపారు. రామచంద్రపురం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ నెల 15న బాలికలకు, 16 న బాలురకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా, చెస్, షటిల్, అథ్లెటిక్స్ విభాగాల్లో ఎంపికలు నిర్వహిస్తామన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ డివిజన్ ఇన్‌చార్జి ఎ.శ్రీనివాస్, మండల ఇన్‌చార్జి లక్ష్మీశ్రీనివాస్ మాట్లాడుతూ 2012 జనవరి 1 తర్వాత పుట్టిన వారు అండర్-14 విభాగానికి, 2009 జనవరి 1 తర్వాత పుట్టినవారు అండర్-17 విభాగానికి అర్హులన్నారు. విద్యార్థులు స్కూల్ ఐడెంటిఫికేషన్‌తో ఎంపికలకు హాజరుకావాలని సూచించారు. కార్యక్రమంలో రామచంద్రపురం మండల ప్రధాన ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు ఉచిత న్యూరో వైద్య శిబిరం

కొత్తపేట: స్థానిక వెంకట సందీప్ 'ఐ' క్లినిక్ ప్రాథమిక కంటి ఆస్పత్రి వద్ద సందీప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత న్యూరో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ట్రస్ట్ చైర్మన్ బండారు పెదవెర్రియ్య (చిట్టిబాబు) శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రాజమహేంద్రవరం సిటీ న్యూరో కేర్ హాస్పిటల్ వారి సౌజన్యంతో నిర్వహించే ఈ శిబిరంలో ఆస్పత్రి వైద్యుడు ఎస్‌జే బాలపరమేశ్వరరావు మెదడు, నరాలు, వెన్నెముక సంబంధిత వ్యాధులకు పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ముఖ్యంగా న్యూరోపతి సెన్సిటివిటి టెస్ట్ ఉచితంగా చేస్తారని తెలిపారు. అలాగే ఉచిత పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచిత కంటి ఆపరేషన్ చేస్తారని తెలిపారు.

శెట్టిబలిజ సంఘ ప్రధాన కార్యదర్శిగా 'కాండ్రేగుల'



రాజోలు: స్థానిక తాలూకా శెట్టిబలిజ సంఘ ప్రధాన కార్యదర్శిగా కాండ్రేగుల రాము ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘ అధ్యక్షుడు కాండ్రేగుల సత్యనారాయణ మూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎన్నిక నిర్వహించారు. సంఘ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రాము తెలిపారు. సంఘ సమన్వయకర్త గుబ్బల శ్రీనివాస్, కోశాధికారి బొక్కా వెంకటేశ్వరరావు, చిట్టూరి గణేష్, బొక్కా ఏడుకొండలు, కడలి సత్యనారాయణ, కాండ్రేగుల శ్రీనివాస్, పెచ్చెట్టి గణేశ్వర రావు పాల్గొన్నారు.

రేపు గన్నమని శత జయంతి వేడుక


కపిలేశ్వరపురంలో వివరాలు వెల్లడిస్తున్న కమిటీ సభ్యులు

కపిలేశ్వరపురం: గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త గన్నమని ఆనందరావు శత జయంతి వేడుకను ఆదివారం కపిలేశ్వరపురంలో నిర్వహించనున్నట్టు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామంలోని విద్య, వైద్యం, ఇతర సామాజిక ప్రగతికి ఆనందరావు, ఆయన కుటుంబీకులు విశేషంగా కృషి చేశారన్నారు. ఆనందరావు కుమారుడు గన్నమని మోహనరావు, సర్పంచ్ శాకా శ్రీనివాస్ తదితరులు శుక్రవారం శత జయంతి వేడుక వివరాలను వెల్లడించారు. 14వ తేదీ మధ్యాహ్నం గ్రంథాలయంలో ఆనందరావు విగ్రహావిష్కరణ, జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆనందరావు కుటుంబీకులు సమకూర్చిన కంప్యూటర్ ల్యాబ్, సీహెచ్‌సీలో 2డీ ఎకో, థైరాయిడ్ మెషీన్, ఇతర వైద్య పరీక్ష పరికరాలను ప్రారంభించనున్నారు. ఎంపీ ల్యాడ్స్, ఆనందరావు కుటుంబీకుల ఆర్థిక సాయంతో నిర్మించ తలపెట్టిన హిందూ శ్మశానవాటిక నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు బలవరెడ్డి సత్తిబాబు, పర్వతిన మురళీకృష్ణ, జిత్తుక మల్లికార్జునుడు, కుడుపూడి సురేష్, కొరపాటి జానకిరామయ్య, మల్లిపూడి శివకుమార్ పాల్గొన్నారు.

అంకితభావంతో కూడిన సేవలకు అవార్డులు


కె.గంగవరం పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న ఏఎంవో, ఉపాధ్యాయులు

కె.గంగవరం: అంకితభావంతో అందించే సేవలకు అవార్డులు వస్తాయని, సమష్టి కృషితోనే పాఠశాలల్లో విద్యాభివృద్ధి సాధ్యమని సమగ్ర శిక్షా అకడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబు పేర్కొన్నారు. మండలంలోని కె.గంగవరం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పొడగట్లపల్లి వెంకటేశ్వరరావును శుక్రవారం పాఠశాలలో సత్కారించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్న నేపథ్యంలో పాఠశాలలో ఏర్పాటు చేసిన సత్కార సభకు ఏఎంవో రాంబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులను సమన్వయం చేసుకుంటూ మంచి నాయకత్వ లక్షణాలతో పాఠశాలను ఉత్తమ పాఠశాలగా తీర్చిదిద్దారన్నారు. ఎంఈవో ఎ.నాగరాజు, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయులు కృపాలాల్, యర్రా ఈశ్వరుడు, వాసంశెట్టి సత్యనారాయణ, పీఎస్‌బీ కుమార్, ఇళ్ల వెంకటరమణ, గుణ్ణం శ్రీనివాస్, టేకుమూడి సుబ్రహ్మణ్యం, సూర్యకుమారి, నేదునూరి వేణుగోపాల్ తదితరులు వెంకటేశ్వరరావు సేవలను ప్రశంసించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు వెంకటేశ్వరరావు దంపతులను శాలువా, పూలమాల, జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, పీఎస్ హెచ్‌ఎం పీఎస్ఎన్ మూర్తి, పాఠశాల ఉపాధ్యాయులు ఇ.శ్రీధర్, ఏడుకొండలు, పితాని శ్రీనివాస్, లల్లీ, ఎ.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అన్నసమారాధనలు


మండపేటలో స్వామివారిని దర్శించుకుంటున్న రాధాకృష్ణ తదితరులు


పసలపూడి అన్నసమారాధనలో భక్తులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణం 15వ వార్డులోని సంతాన గణపతి ఆలయం వద్ద శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. పట్టణంలోని పలు వార్డులకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్న ప్రసాదం స్వీకరించారు. మున్సిపల్ కౌన్సిల్ కో ఆప్షన్ సభ్యుడు రెడ్డి రాధాకృష్ణ, పలు సంఘాల నాయకులు పెంకే గంగాధరం, తాడి రామారావు, దాసరి సత్యనారాయణ, పిఠాపురం సత్యనారాయణ, శివకోటి శేష సుబ్రహ్మణ్యం, పంపన శ్రీనివాస్, దుగ్గిరాల రాంబాబు పాల్గొన్నారు.

కాజులూరు: గొల్లపాలెం శివారు చీకట్లవారిపేట, ఊడావారిపేటలో శుక్రవారం అన్నదానం నిర్వహించారు. గణపతి నవరాత్రుల ముగింపును పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర గ్రామాల భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు.

రాయవరం: మండలంలోని పసలపూడిలో శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. గణపతి నవరాత్రుల ముగింపును పురస్కరించుకుని స్థానిక బస్టాండ్ సమీపంలోని విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. పసలపూడి, చెల్లూరు, రామచంద్రపురం పరిసర ప్రాంతాలకు చెందిన ఐదు వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు, చిన్నం వెంకటరెడ్డి, పడాల అంజి, నక్కా శ్రీను, కొవ్వూరి జొన్నారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విఘ్నేశ్వరునికి ఇరుముడుల అందజేత


ఇరుముడులను అర్చకులకు అందజేస్తున్న దీక్షధారులు

అయినవిల్లి: 41 రోజులు (మండలం) విఘ్నేశ్వరుని మాలధారణ చేసిన పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం మిలటరీ మాధవవరం గ్రామస్తులు శుక్రవారంతో దీక్ష పూర్తవడంతో అయినవిల్లి స్వామికి ఇరుముడులు సమర్పించారు. మిలటరీ మాధవరంలో మొత్తం 30 మంది విఘ్నేశ్వరుని దీక్ష తీసుకున్నారు. 41 రోజులు స్వామికి ప్రత్యేక పూజలు చేసి శుక్రవారం స్వామిని దర్శించుకుని స్వామికి ఇరుముడులు సమర్పించారు. స్వామిని ప్రసన్నం చేసుకుని తాము కోరిన కోర్కెలు తీర్చుకొనేందుకు ఈ మాలధారణ చేసినట్లు వారు తెలిపారు. స్వామివారి ప్రసాదం స్వీకరించారు. అనంతరం తమ దీక్షను ముగించారు. అనంతరం కొంత మంది భక్తులు కాణిపాకంలోని వరసిద్ధి వినాయకుని దర్శనం కోసం బయలుదేరారు.

విద్యుత్ స్తంభాలకు ఫ్లెక్సీలు కడితే చర్యలు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణంలోని విద్యుత్ స్తంభాలకు ఫ్లెక్సీలు, బోర్డులు కట్టిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా పట్టణాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యుత్ స్తంభాలకు ఫ్లెక్సీలు, బోర్డులు కట్టకుండా చర్యలు తీసుకోమని మున్సిపల్ అధికారులను ఆదేశించామన్నారు. ఈ చర్యలతో ప్లాస్టిక్ వినియోగం తగ్గడమే కాకుండా విద్యుత్ స్తంభాలపై ఉన్న లైట్లు, లైన్లు మరమ్మతు పనులు చేపట్టేటప్పుడు ఇబ్బందులు వీడుతాయన్నారు. ఇకపై విద్యుత్ స్తంభాలకు ఫ్లెక్సీలు కట్టిన సిబ్బందితో పాటు ఫ్లెక్సీ యాజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఒక్కో విద్యుత్ స్తంభానికి రూ.5 వేలు చొప్పున జరిమానా విధిస్తామని కమిషనర్ హెచ్చరించారు.

దసరా ఉత్సవాలకు రాట ముహూర్తం

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట రైతు బజార్ సమీపంలోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద నిర్వహించే దసరా ఉత్సవాలకు శుక్రవారం రాట ముహూర్తం చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి పందిరి రాట వేశారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కొబ్బరి కాయ కొట్టి ఉత్సవ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో జొన్నపల్లి సూర్యారావు, పిల్లా గణపతి, అల్లక శ్రీను, యలమంచిలి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక ఏర్పాటు చేయాలి

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణంలో ముస్లింలకు ఖబ్రస్థాన్ శ్మశానవాటికను ఏర్పాటు చేయాలని ముస్లిం జేఏసీ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ సయ్యద్ ఇబ్రహీం మాట్లాడుతూ పట్టణంలోని మసీదు వద్ద ఉన్న శ్మశానవాటిక పరిమిత విస్తీర్ణంలో ఉండటంతో సరిపోవడం లేదన్నారు. పట్టణంలో శ్మశాన వాటికకు స్థలం సమకూర్చాలని ఎమ్మెల్యేను కోరినట్టు తెలిపారు. జేఏసీ నాయకులు అల్తాఫ్, కరీం, ఇబ్రాహీం, గౌస్, చినబాదుల్లా, మౌలాలీ, మెకానిక్ కరీం, రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

సఖినేటిపల్లి: అంతర్వేదికర జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఏలూరి లావణ్య సత్యలక్ష్మి, గంధం లక్ష్మణ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఫెన్సింగ్ విభాగంలో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయిని నారిన ఛాయా ప్రసూనాంబ శుక్రవారం తెలిపారు. మోరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయిలో జరిగిన పై పోటీల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు వారు అర్హత సాధించినట్టు ఆమె పేర్కొన్నారు. పాఠశాల పీడీ కె.భాస్కరరావు పాల్గొన్నారు. కాగా విద్యార్థులను పలువురు అభినందించారు.

బైక్ విన్యాసాలు చేసే యువకులకు గుణపాఠం

రాజోలు: బైక్‌లను అతివేగంగా నడుపుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న పలువురు యువకులకు రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ శుక్రవారం గుణపాఠం చెప్పారు. రోడ్లపై ఇష్టానుసారంగా మోటార్‌సైకిళ్లను మితిమీరిన వేగంతో నడుపుతున్న యువకులను గుర్తించి వారిని రాజోలు సర్కిల్ కార్యాలయానికి తీసుకుని వచ్చారు. వీరిలో కొందరు బైక్ రేసు విన్యాసాలపై శిక్షణ తీసుకుని రాజోలు పరిధిలోని నేషనల్ హైవేలపై మోటార్ సైకిల్ ఫీట్లు చేస్తున్నారు. మితిమీరిన వేగంగా మోటార్‌సైకిళ్ల నడపడం, సైలెన్సర్లు తీసేసి విపరీతమైన ధ్వనితో పబ్లిక్‌లో న్యూసెన్స్ చేస్తే సహించేది లేదని యువకులను హెచ్చరించారు. బైక్ రేస్ డ్రైవింగ్, మద్యం తాగి వాహనాలు నడిపినా, మోటార్‌సైకిళ్లకు సరైన పత్రాలు లేకపోయినా వాటిని సీజ్ చేసి సంబంధిత యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

17, 18 తేదీల్లో క్రీడా పోటీలు

అయినవిల్లి: మండల స్థాయిలో జరిగే క్రీడా పోటీలు ఈ నెల 17, 18 తేదీల్లో జరుగుతాయని శుక్రవారం నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి క్రీడా పోటీల్లో ముక్తేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాల, మండలంలోని ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తారు. క్రీడా పోటీల్లో వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, యోగా, చెస్, అథ్లెటిక్స్ వంటి క్రీడలు ఉంటాయన్నారు. ఈ పోటీల్లో విజేతలను కొత్తపేట డివిజన్ కేంద్రంలో జరిగే పోటీలకు ఎంపిక చేస్తామని నిర్వాహకులు తెలిపారు.